

జనసంద్రంగా మారిన సుల్తాన్‌పూర్ | లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన అశేష జనవాహిని



సభ నిర్వహణ ఏర్పాట్లపై ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

# మెతుకుసీమలో గులాబీ గర్జన

**ప్రభంజనంలా తరలిన ప్రజలు • బీఆర్ఎస్ శ్రేణుల్లో ఫుల్‌జోష్ • ఆలోచింపజేసిన కేసీఆర్ ప్రసంగం**

సుల్తాన్‌పూర్ నుంచి నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఉద్యమాల పురిటి గడ్డ మెతుకుసీమ మరోసారి తన బిడ్డ కేసీఆర్ వెంటే ఉన్నానని చాటిచెప్పింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వచ్చిన గులాబీ దళపతి కేసీఆర్‌కు సుల్తాన్‌పూర్ వేదికగా అపూర్వ స్వాగతం లభించింది. ఇటీవల కాలంలో కనీవిని ఎరుగనిస్థాయిలో పెద్ద ఎత్తున ప్రజలు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాఆశీర్వాద సభకు హాజరై మీ వెంటే మేమున్నామంటూ కేసీఆర్‌కు నైతిక మద్దతు ఇచ్చిన దృశ్యం మంగళవారం ఆవిష్కృతమయ్యింది. ఇసుకేస్తే రాలనంత మంది జనం సభకు హాజరయ్యారు. లక్ష మంది వస్తారని అంచనా వేసిన సభకు అంతకుమించే రావడం గమనార్హం. సభకు జనం రావడమే కాదు.. కేసీఆర్ ప్రసంగం పూర్తయ్యే వరకు ఆసక్తిగా కూర్చొనే ఉండడం గమనార్హం. సాయంత్రం నాలుగు గంటలకల్లా సభా ప్రాంగణానికి చేరుకున్న వారు.. సారు ప్రసంగించి వెళ్లేంత వరకు నేతల ప్రసంగాలు, కళాకారుల ఆటపాటలను ఆసాంతం విన్నారు. ఉమ్మడి జిల్లాలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో జరిగిన తొలి బహిరంగ సభ విజయవంతం కావడం పార్టీలో జోష్ నింపింది.

### జనం మాట... కేసీఆర్ నోట

సభలో కేసీఆర్ తన ప్రసంగంలో ఏ అంశాలు ప్రస్తావిస్తాడా అని ఆసక్తిగా ఎదురుచూశారు. కేసీఆర్ ప్రసంగం పూర్తయ్యే వరకు ప్రజలు కూర్చున్నచోట నుంచి లేవలేదు. తమ మనసులోని మాటలు కేసీఆర్ నోటి నుంచి రావడంతో ప్రజలు చప్పట్లతో మద్దతు తెలిపారు. రాష్ట్రంలో లిల్లీపుట్ పాలన అంటూ పరోక్షంగా కాంగ్రెస్ పార్టీ పాలకుల గురించి చేసిన



ఫుల్‌జోష్: కేసీఆర్ ప్రసంగానికి ఈల వేస్తున్న మహిళ



కళాకారుల పాటలకు ఉత్సాహంతో స్టెప్పులేస్తున్న ఓ వృద్ధుడు, యువకుడు

కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు అద్భుత స్పందన వచ్చింది. 'మెదక్ జిల్లా రుణం తీర్చుకోలేను.. రెండు చేతులెత్తి మొక్కుతున్నా' అంటూ కేసీఆర్ భావోద్వేగ పూరితంగా మాట్లాడినపుడు సభ మొత్తం నిశ్శబ్దం అయ్యింది. సభకు హాజరైన ప్రజలు చేతులెత్తి మీ వెంటే ఉంటామంటూ చెప్పడం కనిపించింది. మెదక్, జహీరాబాద్ లోక్‌సభకు పోటీచేస్తున్న అభ్యర్థులు వెంకట్రామిరెడ్డి, గాలి అనిల్‌కుమార్‌లను ఎలపట..దాపట లెక్క ఉన్నారు..మీ ప్రాంతానికి సేవ చేసే భాగ్యం కల్పించండి అని అన్నపుడు సభలో ఉన్నవారు పిడికిలెత్తి ఉంటామని హామీ ఇచ్చారు. ఇక రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై నిశితంగా విమర్శలు చేశారు. ' డిసెంబర్ 9 తారీఖు ఎటుపాయె.. రుణమాఫీ అయ్యిందా..? రైతు బంధు 15వేలు పడ్డయా.. మన ఆడపిల్లలకు 2500 ఇస్తా అన్నడు.. ఇచ్చిండా..'అంటూ కేసీఆర్ ప్రశ్నిస్తే లేదు.. లేదు అంటూ ప్రజలు సమాధానాలు చెప్పారు. 'అంబేద్కర్‌ను అవమానిస్తే ఊరుకుందామా.. దళిత బంధును బందుపెడితే నోరుమూసుకొని ఉందామా' అని ప్రశ్నించినపుడు ఊరుకునేది లేదు.. కొట్లాడుదామంటూ సభకు వచ్చిన వారు నినాదాలు చేస్తూ చెప్పారు.

### హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్..

సభలో మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన ప్రసంగం ఆలోచింపజేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో ఇచ్చిన హామీలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ మాదిరిగా ప్రజలకు చూపించారు. రైతు బంధు, రుణమాఫీ తదితర అంశాలపై రేవంత్ ఇచ్చి న హామీలను ఆయన మాటల్లోనే ఎల్ఈడీ స్క్రీన్లు పెట్టి చూపిస్తూ వినిపించారు. ఇక ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాడిన పాట ఉర్రూతలూగించింది. గోవిందా.. గోవిందా అంటూ ఆయన రాష్ట్ర ప్రభుత్వ పథకాలు గోవిందా అంటూ పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆట పాట ఉద్యమ రోజులను గుర్తుకు తెచ్చాయి.

### కేసీఆర్ ఉంటేనే నీళ్లు.. రైతుబంధు

సభకు వచ్చిన కొంత మంది 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. సత్తెమ్మ అనే మహిళా రైతు మాట్లాడుతూ కేసీఆర్ ఉన్నపుడు పంటలకు నీళ్లు ఇచ్చిండని, కరెంటు ఇచ్చిండని, రైతుబంధు ఇచ్చిండని చెప్పారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత రైతు బంధు కూడా పడలేదని, కరెంటుతో పెద్ద గోసపడుతున్నామని చెప్పింది. రాయికోడ్‌కు చెందిన గోపయ్య అనే రైతు మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా లేని లోటు ఇప్పుడు కనిపిస్తున్నదని చెప్పారు. బ్యాంకులు రుణాలు ఇవ్వలేదని, రైతు బంధు రాలేదని ఆయన చెప్పారు.



ఆటా పాటా అదిరెన్.. | సభా వేదికపై ధూంధాం పాటలతో ప్రజలను ఉత్తేజపరుస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బృందం

## అలరించిన రసమయి పాటలు

చౌటకూర్, ఏప్రిల్16: సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో నిర్వహించిన కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో కళాకారులు ఆడిపాడారు. తెలంగాణ పోరాటం, బీఆర్ఎస్ పాలన, కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, తెలంగాణ సంస్కృతిపై ధూంధాంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కళాకారులు సభకు వచ్చిన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపారు.

## దేశానికి దిక్సూచి కేసీఆర్

**మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి**

అందోల్, ఏప్రిల్ 16: మాజీ సీఎం కేసీఆర్ దేశానికి దిక్సూచి అని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ సభలో పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. అబద్ధాలు, అలవికాని హామీలతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 140 రోజులైందని, ఇప్పటి వరకు ఏ ఒక్క హామీ సరిగ్గా అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నదని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గత డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారని, ఇప్పటికీ చేయలేదని దుయ్యబట్టారు. ఇప్పుడు మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు ఉండటంతో ఆగస్టు 15న రుణమాఫీ అంటూ కొత్త పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. రుణమాఫీ కావాలన్నా.. ఇచ్చిన హామీలు అమలు కావాలన్నా కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించడం ఒక్కటే మార్గమని ప్రజలకు పోచారం శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.

# ఎడారిగా మార్చిన ఘనత రేవంత్‌దే

**• ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శ**

అందోల్, ఏప్రిల్ 16: పదేండ్లుగా సుభిక్షంగా ఉన్న తెలంగాణను ఎడారిగా మార్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. కేసీఆర్ సభలో ఆయన మాట్లాడుతూ.. జై తెలంగాణ అనని, అమరులకు నివాళులర్పించని ఏకైక సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. తెలంగాణను పదేండ్లపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను నామరూపాల్లేకుండా చేస్తానని మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డికి ఎక్కడ చూసినా కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని అన్నారు. కేసీఆర్ చేపట్టిన పనుల ఆనవాళ్లు లేకుండా చేయడంకోసం రేవంత్ విశ్వప్రయత్నాలు చేస్తున్నాడని మండిపడ్డారు. తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన ఉద్యమం, ప్రజలకు అందించిన సుపరిపాలన చేరిపేస్తే చెరిగేది కాదని అన్నారు. ఆంజనేయుడి ఛాతి చీల్చితే రాముడి ఫొటో కనిపించినట్టు రేవంత్‌రెడ్డి ఛాతి చీల్చితే చంద్రబాబు ఫొటో కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. ఆంధ్రా నేతల ఆదేశాలకు అనుగుణంగా ఇక్కడ పాలన సాగుతున్నదని దుయ్యబట్టారు. దేశం గర్వించదగిన విధంగా కేసీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే రేవంత్‌రెడ్డి మాత్రం కనీసం నివాళులర్పించలేదని మండిపడ్డారు.



సుల్తాన్‌పూర్ సభలో మాట్లాడుతున్న దేశపతి

## ఆకట్టుకున్న 'గోవిందా.. గోవిందా' సాంగ్

పుల్కల్, ఏప్రిల్16: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో మంగళవారం బీఆర్ఎస్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో రచయిత, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాడిన గోవిందా.. గోవిందా.. సాంగ్ ఆకట్టుకున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకపోవడంపై పాట రూపంలో ప్రజలకు అర్థయమయ్యేలా ఆయన పాడి వినిపించారు. 'రైతుబంధు.. గోవిందా.. రైతు రుణమాఫీ గోవిందా.. కల్యాణలక్ష్మి గోవిందా.. షాదీముబారక్ గోవిందా.. కేసీఆర్ కిట్టు గోవిందా..' అంటూ దేశపతి పాడిన పాటతో ప్రజలంతా కేరింతలతో ఉర్రుతలూగారు.

# రేపు బీఆర్ఎస్ అభ్యర్థులకు బీ ఫారాలు

- **అందజేయనున్న బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు**
- **ఎన్నికల్లో అనుసరించే ప్రచార వ్యూహంపై సమీక్ష, దిశానిర్దేశం**

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ భవన్‌లో ఈ నెల 18వ తేదీ (గురువారం)న బీఆర్ఎస్ పార్టీ కీలక సమీక్షా సమావేశం నిర్వహించనున్నది. ఈ సమావేశంలో పార్టీ అధినేత కేసీఆర్ ఎంపీ అభ్యర్థులకు బీఫారాలతోపాటు ఎన్నికల నియమావళిని అనుసరించి అభ్యర్థికి రూ. 95 లక్షల చెక్కును ఒక్కో అభ్యర్థికి అందించనున్నారు. ఈ సమీక్షా సమావేశానికి ఎంపీ అభ్యర్థులతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, జడ్పీ చైర్మన్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్టీ నేతలు హాజరుకానున్నారు. బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం, అనుసరించే వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

### కేసీఆర్ బస్సు యాత్రపై రూట్‌మ్యాప్..

ఈనెల 13న చేవెళ్ల బహిరంగసభ ద్వారా కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. మంగళవారం అందోల్ నియోజకవర్గంలోని సుల్తాన్‌పూర్‌లో ప్రజా ఆశీర్వాదసభకు అశేష ప్రజానీకం హాజరై కేసీఆర్‌కు జైకొట్టారు. ఈ క్రమంలో తాను ప్రజలకు మరింత చేరువ కావాలని కేసీఆర్ నిర్ణయించారు. కరువుతో అల్లాడుతున్న రాష్ట్ర రైతాంగం వద్దకు వెళ్లి వారి కష్ట సుఖాలను తెలుసుకోవడానికి, వారికి భరోసానివ్వడానికి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రలు నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. గురువారం సమావేశంలో కేసీఆర్ బస్సు యాత్ర రూట్ మ్యాప్‌పై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## కేసీఆర్‌కు ఈసీ నోటీసు

**సిరిసిల్ల మీడియా సమావేశంపై కాంగ్రెస్ ఫిర్యాదు**

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): సిరిసిల్లలో ఈ నెల 5న జరిగిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారంటూ ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ నిరంజన్ చేసిన ఫిర్యాదుపై ఎన్నికల సంఘం నోటీసులు జారీచేసింది. నిరంజన్ ఫిర్యాదుపై వాస్తవ నివేదికను పంపాలని ఈసీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆదేశించింది. ఎన్నికల ప్రధాన అధికారి ఇచ్చిన నివేదిక ప్రకారం కేసీఆర్ ఎన్నికల నియామవళిని ఉల్లంఘించినట్టు తెలుస్తున్నదని దీనిపై గురువారం ఉదయం 11 గంటలలోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.





మంగళవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, గెల్లు శ్రీనివాస్

# రేవంత్‌వి బ్లాక్‌మెయిల్ విధానాలు

- **రుణమాఫీపై కుంటిసాకులు**
- **ముదిరాజ్‌లకు మంత్రి పదవి ఇవ్వడం ఇష్టంలేక కొత్త నాటకాలు**
- **మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ ఫైర్**

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత కూడా బ్లాక్‌మెయిల్ విధానాలు మానడం లేదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ విమర్శించారు. రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ సొసైటీలో బ్లాక్‌మెయిల్ చేసి అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి తమ ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారంటూ సొంత పార్టీ నేతలే ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి ఆగస్టు 15 అంటూ కొత్త తేదీ ప్రకటించారని మండిపడ్డారు. అప్పుడు కూడా స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ పేరుతో వాయిదా వేస్తారని ఎద్దేవా చేశారు. 18 ఏండ్లు దాటిన మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్న హామీని విస్మరించిన కాంగ్రెస్ ఇప్పుడు రూ.లక్ష రూపాయలిస్తామంటూ మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని దుయ్యబట్టారు. ముదిరాజ్‌లకు మంత్రిపదవి ఇవ్వడం ఇష్టం లేకే 14 ఎంపీ సీట్లు గెలిపించాలని, కొత్త నాటకానికి తెరలేపారని ఆరోపించారు. మోదీతో చీకటి ఒప్పందం చేసుకొని, కాంగ్రెస్ నుంచి బలహీన అభ్యర్థులను నిలబెట్టారని విమర్శించారు. దానం నాగేందర్ జీవితం మొత్తం పార్టీ ఫిరాయింపులేనని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఆత్మ కేసీఆర్, బీఆర్ఎస్ మాత్రమేనని, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు.

### విద్వేషాలు రెచ్చగొట్టే పార్టీని బొందపెట్టాలి

బీజేపీ మ్యానిఫెస్టోలో చెప్పిందే చెప్తూ ప్రజల్ని మభ్యపెడుతున్నదని, పదేండ్ల పాలనలో బీజేపీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని కిశోర్‌కుమార్ దుయ్యబట్టారు. బీజేపీ పాలనలో ప్రభుత్వరంగ సంస్థలను ఆగం చేశారని, ఐదు లక్షల కంపెనీలు మూతబడ్డాయని, ప్రభుత్వ ఉద్యోగాలను ఖతం చేసి, రిజర్వేషన్లకు తూట్లుపొడుస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించేవారిపై అక్రమ కేసులు పెట్టి బెదిరిస్తున్నారని ఆరోపించారు. కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే పార్టీలను బొందపెట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ కార్పొరేషన్ల చైర్మన్లు చిరుమల్ల రాకేశ్, గెల్లు శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ధర్మేందర్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్, యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వడదెబ్బతో ఇద్దరు మృతి

నవీపేట/హుస్నాబాద్, ఏప్రిల్ 16: వడదెబ్బతో ఇద్దరు మరణించారు. నిజామాబాద్ జిల్లా నవీపేటకు చెందిన ఆర్ లావణ్య (38) అనే ఉపాధి కూలీ మండల కేంద్రంలోని లింగం గుట్ట సమీపంలో ఉన్న చెరువులో సోమవారం ఉపాధి హామీ పనులు చేస్తుండగా ఎండ తీవ్రతకు లోబీపీతో పల్స్‌రేట్ తగ్గిపోయి గుండెపోటుకు గురైంది. వెంటనే చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందినట్టు ఇన్‌చార్జి ఏపీవో నామ్‌దేవ్ తెలిపారు. కాగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన పోస్టుమన్ గూల్ల ఎల్లయ్య(53) వడదెబ్బతో మంగళవారం మృతిచెందాడు. సోమవారం తన ద్విచక్రవాహనంపై విధులు నిర్వహించి సాయంత్రం ఇంటికి వచ్చి బైక్ పార్కు చేస్తున్న క్రమంలో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. సిద్దిపేట దవాఖాన లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

## జనసేన గుర్తుపై జోక్యం చేసుకోం: హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): జనసేనకు పార్టీ గుర్తుపై భారీ ఊరట లభించింది. ఇప్పటికే ఎన్నికల కమిషన్ జనసేనకు గాజు గ్లాసు గుర్తు కేటాయించినందున, తాము ఎన్నికల వేళ జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. జనసేనకు గాజు గ్లాసు గుర్తును కేటాయిస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గతంలో రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఆ తర్వాత జనసేన పార్టీ గాజు గ్లాస్ గుర్తును ఈసీ ఫ్రీ సింబల్స్ జాబితాలో ఉంచింది. దీంతో దాన్ని తమకు కేటాయించాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ మరో రిట్ పిటిషన్ కూడా దాఖలు చేసింది.